ఈనాడు
సిద్దిపేట
గురువారం సెప్టెంబరు 26, 2024

బడికి వెళ్లాలంటే.. బడితె ఉండాల్సిందే..

చేర్యాల, న్యూస్‌టుడే: కొమురవెల్లి మండలం కిష్టం పేట గ్రామ విద్యార్థులు నిత్యం పుస్తకాలతో పాటు బడితె పట్టుకొని బడికి వెళ్లాల్సిందే. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో 24 మంది చదువుతున్నారు. వానరాల బెడద అధికం కావడంతో రక్షణకు వీటిని వెంట ఉంచుకుంటున్నారు. బడికి వచ్చేటప్పుడు, తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు, విరామ సమయంలో శౌచాలయాలకు వెళ్లాలన్నా చేతిలో బెత్తం ఉండాల్సిందేనని ఆ చిన్నారులు గుర్తించారు. అందుకే ఇలా కొందరు కర్రలు పట్టుకొని ముందు వెళ్తూ. . కోతులను తరిమికొడతారు. ఆ తర్వాత వారి వెనకాల మిగిలిన పిల్లలు వెళ్తున్నారు. నిత్యకృత్యమైన ఈ సమస్యను తీర్చాలని చిన్నారులు కోరుతున్నారు.


తరగతి గది కిటికీపై కోతి


బడితె పట్టుకొని శౌచాలయానికి వెళ్తున్న విద్యార్థులు

మార్గదర్శకుడు పండిట్ దీన్ దయాళ్: ఎంపీ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: అంత్యోదయ పథకం ద్వారా ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సూచించిన మార్గదర్శకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో మానవతా దృక్పథంతో ఉండాలని సూచించిన మహనీయుడని, భావితరాలకు ఆయన ఒక దిక్సూచి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, నాయకులు ఉపేందర్‌రావు, శ్రీనివాస్, దినేష్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై సీఎం సంతృప్తి: ఆంక్షారెడ్డి

గజ్వేల్, న్యూస్‌టుడే: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి గజ్వేల్‌కు చెందిన తూంకుంట ఆంక్షారెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. సభ్యత్వ నమోదుపై రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన స్పందనను ఆమె సీఎంకు వివరించారు. సావదానంగా విన్న సీఎం సభ్యత్వ నమోదుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. మైనారిటీ విభాగం ఇన్‌ఛార్జి అయూబ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ఆంక్షారెడ్డి

విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం: హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం పెరిగిందని, దీంతో క్రీడలు ఆడే సామర్థ్యం పూర్తిగా తగ్గిపోతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటి నుంచి ఉపాధ్యాయులు బయటకు తీసుకొచ్చి, మానవ విలువలు, ఐక్యత పెంపొందించే విధంగా విద్యాబోధన చేయాలన్నారు. విద్యాసంస్థల్లో గంజాయి, మత్తుపదార్థాల సంస్కృతి పెరిగిపోతుందని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిఘా సారించాలన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ట్రస్మా ఆధ్వర్యంలో గురువందనం (గురుపూజోత్సవం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. వచ్చే బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా పంచాయతీలకు ప్రభుత్వం నిధులు కేటాయించి విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్. రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, భాస్కర్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో పారిశ్రామిక పార్కు!

● 100 ఎకరాల స్థలం కేటాయింపు
● ఉపాధి అవకాశాలపై ఆశలు

న్యూస్‌టుడే, హుస్నాబాద్

హుస్నాబాద్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పరచడానికి అడుగులు పడుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఉత్సాహవంతులైన పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలంటూ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రోత్సాహం అందిస్తామని అధికారులు ప్రకటించారు. పార్కు ఏర్పాటు ప్రతిపాదన అమలుకు అడుగులు పడుతుండటంతో హుస్నాబాద్ ప్రాంత వాసుల్లో ఉపాధి ఆశలు చిగురిస్తున్నాయి.

హుస్నాబాద్‌కు 12 కి.మీ దూరంలో ఉన్న అక్కన్నపేటలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు రెవెన్యూ అధికార యంత్రాంగం 387 సర్వే నంబరులో దాదాపు వంద ఎకరాలు కేటాయించింది.



20 రోజుల క్రితమే టీజీఐఐసీ జోనల్ మేనేజర్, ఇతర అధికారులు సందర్శించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అనుకూలం

హుస్నాబాద్ ప్రాంతంలో ప్రధానంగా ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుంది. వ్యవసాయోత్పత్తులు గణనీయంగా లభించే అవకాశం ఉండటమే ఇందుకు కారణం. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు ఇతర పప్పు దినుసుల ఉత్పత్తులు ఎక్కువగా ఉన్నాయి. వరి ధాన్యాన్ని ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో దాదాపు 2 లక్షల క్వింటాళ్ల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. అదే విధంగా మొక్కజొన్న, పత్తి సాగు గణనీయంగా ఉంటుంది. వ్యాపారులు వీటితో పాటు పప్పు దినుసులను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. కేవలం వర్షాధారంగా చెరువులు, కుంటలు, బావులపై ఆధారపడి సాగు చేస్తున్నారు. ఏడాదిలో గౌరవెల్లి రిజర్వాయర్ ద్వారా సాగునీరు లభిస్తే ఉత్పత్తులు మరింత పెరిగే అవకాశం ఉంది.

వలసలకు అడ్డుకట్ట

ఉపాధి అవకాశాలు లేక ఈ ప్రాంత వాసులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. పరిశ్రమలు ఏర్పాటైతే ఇక్కడే పని చేయడానికి అనేక మంది నిరుద్యోగ యువకులు ఉత్సాహం చూపుతారు. అంతేకాదు వలసలకు అడ్డుకట్ట పడనుంది. స్థానికంగానే ఉపాధి లభిస్తే కుటుంబాలు కూడా ఆర్థికంగా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది.


కేటాయించిన స్థలమిదే..

రవాణా సౌకర్యాలు బాగు

అక్కన్నపేట సిద్దిపేట, కరీంనగర్, వరంగల్, జనగాం పట్టణాలకు దాదాపు 40 కి.మీ దూరంలో ఉంది. రవాణా సౌకర్యాలు బాగున్నాయి. రోడ్డు, రైలు మార్గాలున్నాయి. గౌరవెల్లి రిజర్వాయర్ కాల్వల నుంచి అవసరమైన నీటి సదుపాయాన్ని పొందే అవకాశం ఉంది. ప్రధానంగా హుస్నాబాద్ నుంచి జనగామ రహదారి ప్రస్తుతం రెండు వరుసలతో ఉండగా ఎన్‌హెచ్‌గా అభివృద్ధిచేయడానికి ప్రతిపాదనలో ఉంది. విద్యుత్తుకు సంబంధించి 220 కేవీ ఉపకేంద్రం ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటున్నాయి.

ఐటీఐలలో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం), న్యూస్‌టుడే: ఐటీఐలలో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కుకునూరుపల్లి ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు గడువు ఉందన్నారు. గతంలో ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారు తాజాగా ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు iti.telangana.gov.in లో వివరాలు నమోదు చేయాలన్నారు. కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్‌లలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా విద్యుత్తు లైన్ల మార్పిడితో సిద్దిపేట గ్రామీణ మండలం ఇర్కోడు ఉపకేంద్రం పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు

మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబరును అందుబాటులోకి తేవాలని, అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలని సిద్దిపేట జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి-సంక్షేమ పథకాలపై బుధవారం సమావేశం నిర్వహించారు. 10 శాఖలపై సమీక్ష చేశారు. మంత్రి నేతృత్వంలో ఇది మొదటి సమావేశం కాగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, దుబ్బాక, జనగాం, మానకొండూరు ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు.


వయో వృద్ధుల దినోత్సవ గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ మనుచౌదరి ఎంపీ రఘునంద్‌రావు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి

పతిపాదనలు సిద్ధం చేయండి

సభలో ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రస్తావించిన పలు అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ మంత్రి.. అధికారులకు సూచనలు చేశారు. రుణమాఫీలో ఎదురయ్యే చిన్నపాటి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరిని ఆదేశించారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేయాలని, బోధనాసుపత్రిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మూడు ప్రధాన పార్టీల ప్రజాప్రతినిధులు ఒకేవేదికపై వచ్చిన నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపాలిటీల అధ్యక్షులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల అధికారులపై మంత్రి అసంతృప్తి

గ్యాస్ సిలిండర్లకు సంబంధించి రాయితీ జాబితా లేకపోవడం, కొందరికి వర్తించకపోవడానికి కారణాలను జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ స్పష్టం చేయకపోవడంపై మంత్రి ప్రశ్నించారు. బాధ్యతగా ఉండాలంటూ చురకలు అంటించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు పెంచాలన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై కొరడా ఝుళిపించాలన్నారు.

నిధులు మళ్లించొద్దు: ఎంపీ రఘునందన్‌రావు వ్యవసాయ యంత్రాలు, పరికరాలకు సంబంధించి కేంద్రం కేటాయించే నిధులను మళ్లించొద్దు. మల్లన్నసాగర్ ప్రాజెక్టులో వ్యవసాయ భూములు కోల్పోయిన తుక్కాపూర్ రైతులను మత్స్యకార కమిటీల్లో చేర్చాలి. దుబ్బాక డయాలసిస్ కేంద్రంలో పడకల సంఖ్యను ఐదుకు పెంచాలి. అక్బర్‌పేట-భూంపల్లిలో 30 పడకలను ఏర్పాటు చేయాలి.

పరిహారం విడుదల చేయాలి: ఎమ్మెల్యే హరీశ్‌రావు.. జిల్లాకు రెగ్యులర్ వ్యవసాయ అధికారిని నియమించాలి. పీఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య ఒకప్పటితో పోల్చితే సగం తగ్గిపోయింది. రూ.2 లక్షలలోపు రుణం 30-40 శాతం మంది రైతులకు ఇంకా వర్తించలేదు. పంట నష్ట పరిహారం విడుదల చేయాలి. మర్పడ్గ వద్ద అర్బన్ పార్కును అభివృద్ధి చేయాలి. కలెక్టరేట్ వద్ద అసంపూర్తిగా నిలిచిన వెటర్నరీ వైద్య కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

రాయితీ సిలిండర్ రావడం లేదు: ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి.. రూ.500 లకే రాయితీ సిలిండరు అందరికి రావడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన మహిళా సంఘాలకు కమీషన్ సొమ్ము విడుదల చేయాలి. దుబ్బాకలో 100 పడకల ఆసుపత్రిలో డెంటల్ కిట్లను అందించాలి.

మహిళలకు నైపుణ్య శిక్షణలు అందిస్తూ మార్కెటింగ్ అవకాశాలు పెంచాలన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు బీమా పరిధిలో కొత్త వారిని చేర్పించాలన్నారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. గజ్వేల్ ఎంసీహెచ్‌లో సదుపాయాలు కల్పించాలని, గర్భిణులు, బాలింతలకు కిట్లు అందించాలని కోరారు.

రేపటి నుంచి సైన్స్ ప్రయోగ తరగతులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సిద్దిపేట అభ్యసన కేంద్రంలో ఈనెల 27వ తేదీ నుంచి డిగ్రీ ద్వితీయ సెమిస్టర్ సైన్స్ ప్రయోగ తరగతులు ప్రారంభమవుతున్నట్లు కేంద్రం సమన్వయకర్త డా.శ్రద్ధానందం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. హాజరయ్యే విద్యార్థులు వెంట గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 73829 29615 చరవాణి నంబరులో సంప్రదించాలన్నారు.

29న మరసం వార్షికోత్సవ సభ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మంజీర రచయితల సంఘం వార్షికోత్సవ సభను సిద్దిపేటలో ఈనెల 29న ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మరసం వ్యవస్థాపకుడు నందిని సిధారెడ్డి, మరసం అధ్యక్షుడు రంగాచారి వెల్లడించారు. సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. సభా ప్రాంగణానికి గద్దర్ ప్రాంగణం, వేదికకు దేవీప్రియ వేదిక, జాన్‌వెస్లీగా నామకరణం చేశామన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. అనంతరం ప్రముఖ కవులతో కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మరసం ప్రతినిధులు యాదగిరి, రాజిరెడ్డి, కిషన్, శ్రీనివాస్, బాలయ్య, అశోక్ పాల్గొన్నారు.

నాణ్యత ఆరు నెలలేనా!

న్యూస్‌టుడే, దుబ్బాక: హనుమకొండ, సిద్దిపేట, మెదక్ల జిల్లాలను కలుపుతూ మెదక్ నుంచి ఎల్కతుర్తి(సిద్దిపేట మీదుగా) వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరు నెలల క్రితమే దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్ శివారులో చేపట్టిన పనుల్లో నాణ్యత సరిగా లేక రహదారికి ఒకవైపున ఏర్పాటు చేసిన రాళ్ల తెట్టె (స్టోన్ రివెట్‌మెంట్) ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. దీంతో వాహన చోదకులు నాణ్యతపై ప్రశ్నిస్తున్నారు.


తిమ్మాపూర్ శివారులో జాతీయ రహదారిపై ఒక వైపు కూలిన రాళ్లు

మట్టి దిబ్బలు కూలకుండా..

8 అడుగుల లోతులో తవ్వి రహదారి నిర్మాణం చేపట్టారు. రహదారికి ఇరువైపులా పెద్ద మురుగు కాల్వలను నిర్మించారు. వీటికి ఇరువైపులా 8 అడుగుల మేర ఎత్తులో మట్టి దిబ్బలు కిందికి కూలకుండా 100 మీటర్ల మేర పెద్ద రాళ్లతో తెట్టెను ఏర్పాటు చేశారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు ఒక వైపున కొంత భాగం కూలిపోయి, రాళ్లన్ని మురుగు కాల్వ దిమ్మెలపైన, కాల్వ లోపల పడిపోయాయి. దీంతో 6 నెలల క్రితం ఏర్పాటు చేసిన పనుల్లో నాణ్యత లోపించిందని చోదకులు చెబుతున్నారు. తక్షణమే ఎన్‌హెచ్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎన్‌హెచ్ డీఈ డి.అన్నయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వారం రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని వెల్లడించారు.

వైద్యం వికటించి మహిళ మృతి


మహేశ్వరి

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్యం వికటించి కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తేలు మహేశ్వరి(40) బుధవారం మృతిచెందింది. వివరాలివీ.. మహేశ్వరి వారం రోజుల క్రితం జ్వరంతో బాధపడుతూ దుద్దెడలోని ఆర్‌ఎంపీ వైద్యుడు ఆంజనేయులు వద్దకు వెళ్లింది. ఆయన చేసిన వైద్యం వికటించడంతో పరిస్థితి విషమించింది. వెంటనే బాధితురాలిని కుటుంబసభ్యులు సిద్దిపేట, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారం రోజులుగా కోమాలోనే ఉంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మహేశ్వరి భర్త నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వికటించిన వైద్యంపై వైద్యాధికారులు విచారణ చేపట్టి ఆంజనేయులు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సాలయాన్ని సోమవారం సీజ్ చేసిన విషయం తెలిసిందే.

'తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు'

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చవద్దని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం సిద్దిపేటకు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన పొట్టి శ్రీరాములు పేరు మార్చి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టడం వల్ల తమ మనోభావాలు దెబ్బతింటాయన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభ ప్రతినిధులు రత్నాకర్, నవీన్‌కుమార్, మహేందర్‌రావు, గోపాల్, శ్రీనివాస్, ఆంజనేయులు, భద్రయ్య, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై పర్యవేక్షణ

26 మండలాలకు ఎంఈవోల నియామకం

న్యూస్‌టుడే, సిద్దిపేట: ప్రాథమిక స్థాయిలో విద్యా వ్యవస్థ బలోపేతానికి కీలక ముందడుగు పడింది. ప్రతి మండలానికి విద్యాధికారి నియామకంతో విద్యావ్యవస్థ గాడిలో పడేందుకు దోహదం చేయనుంది. ముఖ్యంగా పాఠశాలలపై పర్యవేక్షణ పెరగనుంది.

ఇన్నాళ్లు 26 మండలాలకు కేవలం ఎనిమిది మంది ఎంఈవోలు మాత్రమే పని చేశారు. ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు మండలాల బాధ్యతలను నిర్వర్తించడం తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వ కార్యక్రమాల అమలు, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారుల సమీక్షల కారణంగా పాఠశాలలపై సరైన పర్యవేక్షణ కొనసాగకపోయేది. పాఠశాలలను తనిఖీ చేసేందుకు టూర్ షెడ్యూల్ నిర్ణయించినప్పటికి... సమీక్ష, మరో కార్యక్రమం ఉందని చరవాణి సందేశం, లేదా ఫోన్ రాగానే వెంటనే వెళ్లాల్సి వచ్చేది.



సాఫీగా సాగేలా..

జిల్లాలో వివిధ రకాల యాజమాన్యాల పరిధిలో మొత్తం 1262 పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఆయా వాటిల్లో 1.75 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో ఉపాధ్యాయుల బోధన, హాజరు, మధ్యాహ్న భోజనం, ఎఫ్ఎల్ఎన్, ఎల్ఈపీ అమలు, విద్యార్థులకు ఏకరూపదుస్తులు, పాఠ్య, రాత పుస్తకాలు పంపిణీ, ప్రభుత్వ కార్యక్రమాలు, యూడైస్+ నమోదు, విజ్ఞాన మేళాలు, వివిధ రకాల పరీక్షలు, వాటి ఫలితాలపై ఎప్పటికప్పుడు విశ్లేషణ తదితర వాటిని పర్యవేక్షించడంలో ఎంఈవోల పాత్ర కీలకం. ఈ తరుణంలోనే ప్రక్రియ సాఫీగా సాగేలా.. మండలాల వారీగా సీనియర్, గెజిటెడ్ హెచ్‌ఎంలను మండల విద్యాధికారి పోస్టుల్లో ప్రభుత్వం నియమించింది.

మెరుగైన ఫలితాల సాధన:



ఎంఈవోల నియామకంతో విద్యావ్యవస్థ పటిష్ఠం అవుతోంది. పక్కాగా పర్యవేక్షణ ఉంటుంది. మెరుగైన ఫలితాల సాధనకు దోహదం చేయనుంది.
శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

వీటిపై దృష్టి పెట్టాల్సిందే..

ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తోంది. ఇది వరకు మన ఊరు-మనబడి ద్వారా పనులు చేపట్టారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంది.

పంట రుణాలు మాఫీ కాలేదని రైతుల నిరసన

బెజ్జంకి, న్యూస్‌టుడే: అర్హత ఉన్నా పంట రుణాలు మాఫీ కావడం లేదని ఆరోపిస్తూ మండలంలోని తోటపల్లిలో ఇండియన్ బ్యాంకు ఎదుట బుధవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు షట్టర్‌ను మూసివేసి మేనేజర్, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. రుణమాఫీ చేయాలని పలు విధాలుగా రైతులు నిరసన తెలపగా కొద్ది రోజుల క్రితం అధికారులు అర్హులైన రైతుల జాబితాను బ్యాంకు ఆవరణలో ప్రదర్శించారు. సాంకేతిక లోపంతో ఆలస్యం జరుగుతోందని, కొద్ది రోజులు గడువు ఇవ్వాలని సిబ్బంది కోరగా నిరసన విరమించారు. మళ్లీ బ్యాంకుకు వచ్చినా అదే మాట చెబుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. సుమారు 800 మంది రైతుల వరకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. ఈ సమయంలో ఇదే గ్రామంలో భాజపా సభ్యత్వ నమోదుకు హాజరైన మాజీ మంత్రి, రాష్ట్ర నాయకుడు పెద్దిరెడ్డి బ్యాంకు ఆవరణలో రైతులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. బ్యాంకు ఉన్నతాధికారులతో చరవాణిలో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వానాకాలం సీజన్ ముగింపునకు వస్తున్నా ఇప్పటికీ రైతుభరోసా ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు రాజు, నాయకులు అనిల్‌రావు, వరుణ్‌రావు, రవికుమార్, రైతులు పాల్గొన్నారు.


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న పెద్దిరెడ్డి

నేడు యోగా శిక్షకులకు ముఖాముఖి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో ఉన్న ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో యోగా శిక్షకుల భర్తీకి నేడు మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ముఖాముఖి నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి మధుమిత తెలిపారు. మొత్తం 88 మందిని(సిద్దిపేట జిల్లాలో పురుషులు-16, మహిళలు-16) ఎంపిక చేయనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10.30 గంటలలోపు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.


నాచారం హల్దీ చెక్‌డ్యామ్ వద్ద మత్తడి దూకుతూ..


వరదలో వేలూరు సబ్‌స్టేషన్


శనిగరంలో నేలకొరిగిన వరి పంట

వర్గల్‌లో భారీ వర్షం

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లోని చెరువులు కుంటలు నిండాయి. అలుగులు పారుతున్నాయి. మండలంలో 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ బాలరాజు తెలిపారు. మండలంలోని వేలూరులో రంగం చెరువు అలుగు పారి పక్కనే ఉన్న సబ్‌స్టేషన్‌లోకి నీరు భారీగా చేరింది. వరద నీరు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రం వద్ద ఉన్న హల్దీ చెక్ డ్యామ్ పొంగి పొర్లింది.

కోహెడ గ్రామీణం: రెండు రోజుల కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నేలకొరుగుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా శనిగరంలో పలుచోట్ల వరి పంట నేలవాలింది. వర్షాలు ఇలాగే కురిస్తే పంటలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.


వేలూరు రంగం చెరువు అలుగు పారడంతో రోడ్డుపై వరద

పౌరసేవకు ప్రశంస

చేర్యాల(మద్దూరు), సిద్దిపేటటౌన్, న్యూస్‌టుడే: మద్దూరు ఏఎస్సై జగదీశ్వర్, సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ కవితలకు బెస్ట్ సిటిజన్ అవార్డులు వరించాయి. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు అందిస్తున్న సామాజిక సేవలు, విధి నిర్వహణలో చూపిస్తున్న ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. జులై, ఆగస్టు నెలలకు సంబంధించి ఉత్తమ సేవలందించినందుకు జగదీశ్వర్ రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు పొందారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా రివార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట సీపీ అనూరాధ మాట్లాడుతూ అంకితభావంతో సీసీటీఎన్ఎస్ డేటాను ఏరోజుకారోజు నమోదు చేయాలని, దాని ఆధారంగానే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రివార్డులు, అవార్డులు ఉంటాయన్నారు.


డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న మద్దూరు ఏఎస్సై జగదీశ్వర్

ప్రతి కుటుంబానికి స్మార్టు కార్డు

వచ్చే నెల నుంచి సర్వే • మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి ప్రత్యేకంగా ఫ్యామిలీ స్మార్ట్ (డిజిటల్) కార్డు అందించే దిశగా వచ్చే నెల నుంచి సర్వే మొదలవుతుందని, రేషన్ కార్డులు అందించేందుకు అడుగులు పడనున్నాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖలు, సిద్దిపేట జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఒకే కార్డుపై ప్రభుత్వ పథకాలు అందే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతుందన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి-సంక్షేమ పథకాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్యామిలీ కార్డు ద్వారా కుటుంబానికి సంబంధించి అన్ని వివరాలు తెలుసుకోవచ్చని, అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పింఛను, రేషన్, హెల్త్ ప్రొఫైల్, ప్రభుత్వ పథకాలన్నింటికి ఉపయోగపడుతుందన్నారు. ఒకవేళ ఆసుపత్రికి వెళ్లినా ఆరోగ్య స్థాయి వివరాలు సులువుగా తెలుస్తాయని, చికిత్స సత్వరం అందుతుందన్నారు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తుల్లో దాదాపు ఐదు అంశాలను అమలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, మార్గదర్శకాలు రాగానే అమలు చేస్తామన్నారు. పర్యాటకం, ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారని తెలిపారు. నిధుల లేమి సమస్య ఎక్కువగా ఉందని, విధులు వచ్చిన వెంటనే పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలు కలెక్టర్ పరిధిలో ఉంటే త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, దుబ్బాక, జనగామ, మానకొండూరు ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ మనుచౌదరి, అధికారులు పాల్గొన్నారు.

బోధన భళా.. కొలువుల కళ

ఒకే కళాశాల నుంచి 87 మంది ఏఈఈలు



నీటిపారుదల శాఖలో ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులు



న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి టౌన్, కంది:

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల.. ఎన్నో ఆశలతో ఇక్కడ చదివారు. అధ్యాపకుల బోధన.. విద్యార్థులు కష్టపడి చదివారు. వీరిలో కొందరు వ్యవసాయ శాఖలో ఏఈవోలుగా పని చేస్తున్నా పెద్ద ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. నిరంతరం లక్ష్య సాధనకు కృషి చేశారు. కష్టపడి చదవడంతో వారికి ఇష్టమైన నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ)గా ఉద్యోగాలు సాధించారు. రైతులకు మరింత సేవ చేసేందుకు తమకు అవకాశం దక్కిందని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఘనత.. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ పత్రాలు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం..

బ్యాంకు ఉద్యోగం మానేసి..

– శరత్‌చంద్ర



మాది మహబూబ్‌నగర్ జిల్లా. తల్లిదండ్రులు చంద్రశేఖర్- పోచమ్మ. వ్యవసాయం చేస్తూ చదివించారు. నేను ఎంబీఏ చదివి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేశా. నాన్న కోరిక మేరకు వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చేరా. ఆశించిన నీటిపారుదల శాఖలో ఏఈఈ పోస్టుకు ఎంపికయ్యాను.

నాణ్యతతో సుసాధ్యం

కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ చదివిన 87 మంది నీటి పారుదల శాఖలో ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్రంలోనే అత్యధిక మంది ఒకేసారి ఎంపికైన ఘనతను కళాశాల దక్కించుకుంది. గతంలో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు చదువుల్లో వెనకబడ్డారు. మూడేళ్ల క్రితం వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టి అధ్యాపక పోస్టులు భర్తీ చేయించుకున్నారు. నిష్ణాతులైన అధ్యాపక బృందం.. నాణ్యమైన బోధనే విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకునేందుకు దోహద పడ్డాయి. వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నిరూపించారు. భవిష్యత్‌లో ఈ కళాశాలలో చేరే విద్యార్థులకు దిక్సూచిగా నిలిచారు.

లక్ష్య సాధనకు కృషి

– మాన్యరెడ్డి



మాది మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం. తండ్రి వాసురెడ్డి, వ్యవసాయ కుటుంబం మాది. వ్యవసాయ విస్తరణ అధికారిగా పని చేస్తూనే ఇక్కడ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చదివా. వ్యవసాయంలో రైతులకు కొత్త పద్ధతులకు సంబంధించి సూచనలు సలహాలు ఇచ్చేదాన్ని. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ప్రణాళికతో చదివా.

అమ్మానాన్నల ఆశయం

– భవాని



మాది సూర్యాపేట. మా తల్లిదండ్రులు గురుమూర్తి- పద్మావతి. ప్రభుత్వ ఉద్యోగం రావాలన్న అమ్మానాన్నల కోరిక. చిన్నతనం నుంచి కష్టపడి చదివించారు. వారి ఆశయ సాధనను నిరంతరం గుర్తు చేసుకునేదాన్ని. అధ్యాపకులు సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేసేవారు. చదువు పూర్తి కాగానే ఏఈఈ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

ఆర్ద్రా మహోత్సవ వైభవం



కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడ్గలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం ఆర్ద్రా మహోత్సవం వైభవంగా జరిగింది. క్షేత్ర నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ, వైదికుల పర్యవేక్షణలో గణపతి పూజ, పాశుపత అభిషేకం, విశేషార్చన, హోమం, పూర్ణాహుతి జరిగాయి. భక్తులు విజయదుర్గను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

28న ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఇంటర్మీడియట్) ఆధ్వర్యంలో ఈ నెల 28న మెదక్‌లోని ఇందిరా గాంధీ మైదానంలో ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అండర్-19 ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గణపతి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పదో తరగతి మెమో, బోనఫైడ్, జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

స్వచ్ఛ ఆకృతి.. స్ఫూర్తి



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని ఫుట్‌బాల్ మైదానంలో విద్యార్థినులు 'ఎస్‌హెచ్‌ఎస్' అక్షరాల ఆకృతిలో బుధవారం ప్రదర్శన చేపట్టారు. 40 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు ఉన్న ఈ మైదానంలో మొత్తం 500 మంది విద్యార్థినులు కేవలం 40 నిమిషాల్లో క్రమశిక్షణగా ప్రదర్శనలో కూర్చున్నారు. అంతకు ముందు వారు శ్రమదానం చేశారు. పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

చారిత్రక ప్రదేశాలే సంపద

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వమే తరగని సంపద అని సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జగదీశ్వర్ అన్నారు. కళాశాల యువ, పర్యాటక క్లబ్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు బుధవారం నిర్వహించారని చెప్పారు. 'నాకు నచ్చిన పర్యాటక ప్రదేశం' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'పర్యాటక రంగ అభివృద్ధిలో యువత పాత్ర' అంశంపై ఉపన్యాసం, 'పర్యావరణహిత సుస్థిర పర్యాటక రంగం' అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీలు ఏర్పాటు చేశారు.

విలువ పెంచే మూలాలు

మూలాలను మరిచిపోయి ఎంతగా ఎదిగినా జీవితాన్ని మోసపుచ్చినట్టే లెక్క... ప్రముఖులు యువతకు సూచించే విషయమిది. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినా, ఇతర రంగాల్లో స్థిరపడినా కొందరు అంతకు ముందు తాము ఏ విధులు నిర్వర్తించే వారో మరచిపోకుండా తరచుగా వాటిని చేపడుతుంటారు. నైపుణ్యం చెక్కుచెదరకుండా చూసుకుంటారు. ఈ కోవలోనే వృత్తి, ప్రవృత్తులతో ముందడుగు వేస్తున్న కొందరి జీవన గమనంపై 'న్యూస్‌టుడే' కథనం.

వడ్రంగి.. నైపుణ్యమండీ

కొడంగల్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం ఇందనూర్ గ్రామానికి చెందిన వడ్ల ముద్దప్ప, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు వడ్ల కృష్ణ. ఎంఏ, డీఈడీ చేసి ప్రస్తుతం బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధిస్తున్నారు. తాత బాలప్ప, తండ్రి ముద్దప్ప వద్ద కృష్ణ వడ్రంగి పనులను చిన్నప్పుడు నేర్చుకున్నారు. నాగలి, గొర్రు, గుంటుక వంటి వ్యవసాయ పరికరాలను తయారు చేయడం, సీజన్‌లో మరమ్మతులు చేస్తున్నారు. జొన్నలు, వడ్లు, ఇతర పంటలను రైతులు కృష్ణ కుటుంబానికి అందిస్తారు.



పరికరాలు తయారు చేస్తున్న కృష్ణ

వారసత్వ ఇస్త్రీ

తాండూరు టౌన్: వాళ్లు ముగ్గురు అన్నదమ్ములు.. ప్రభుత్వ ఉపాధ్యాయులు. కుల వృత్తి స్ఫూర్తితోనే తాము ఉపాధ్యాయులుగా ఎదిగామని నమ్మి పనిని కొనసాగిస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన రమేశ్.. యాలాలలోని ప్రభుత్వ పాఠశాలలో, రాజేశ్.. హాజీపూర్‌లో, శ్రీనివాస్.. పెద్దేముల్ మండలం మంబాపూరులో ఉపాధ్యాయులుగా బోధిస్తున్నారు. సాయంత్రం పాఠశాల సమయం పూర్తి కాగానే ముగ్గురూ తమ ఇళ్ల వద్ద ఇతరుల దుస్తులను ఇస్త్రీ చేస్తున్నారు. ఎంత ఎదిగినా భేషజానికి పోకుండా వారసత్వంగా వృత్తి నైపుణ్యాలు ఉంటే జీవితం సంతృప్తిగా ఉంటుందని వారు తెలిపారు.



శ్రీనివాస్



రమేశ్



రాజేశ్

ఆదాయం మెరుగు పరిచే బజ్జీ

తాండూరు: వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రంథాలయ సహాయకుడు కృష్ణ రోజూ విధులు ముగియగానే అదనపు సంపాదనకు బజ్జీలు వేస్తూ విక్రయిస్తున్నారు. వారు ఐదుగురు కుటుంబ సభ్యులు. 2009లో పొరుగుసేవల విధానంలో ఉద్యోగంలో చేరారు. రాత్రి 7 గంటల వరకు విధుల్లో ఉంటారు. తర్వాత 12 కి.మీ. దూరంలోని తాండూరులో రాత్రి 8 గంటల నుంచి బజ్జీల విక్రయ దుకాణం తెరుస్తారు. బజ్జీల విక్రయంతో ఆదాయం చేదోడుగా ఉంటోందని తెలిపారు.



బజ్జీలు వేస్తున్న కృష్ణ

ఆధ్యాత్మికం.. పరవశం

న్యూస్‌టుడే, దోమ: 'ఏ తీరుగ నను దయ చూసెదవో ఇనవంశోత్తమ రామా..', 'శివ శివ యనరాదా మనసా..' ఇలా దేవాలయాలు, మఠాల్లో భజనలు భక్తితత్పరతతో మార్మోగుతుంటాయి. కీర్తనలను, పాటలను పాడటానికి కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా భజన మండళ్లు ఉన్నాయి. వివిధ గ్రామాల్లోని గుళ్లలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతారు. అక్కడ రాకమచర్ల కీర్తనలు, భక్త తుకారం, రామాయణం, పాండురంగడి భజనలు, తత్వాలు పాడతారు. సాధారణంగా పుణ్యదినాలు, పండుగలు, శని, ఆది, సోమవారాల్లో కార్యక్రమాలు ఉంటాయి. వికారాబాద్ జిల్లా దోమ మండల పాలేపల్లికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి భక్తులు పూర్వీకుల నుంచి ఈ ఆచారాన్ని అనుసరిస్తున్నారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఆధ్యాత్మిక పాటలు, పద్యాలు, పండగలపై ప్రవచనాలను సాధన చేయిస్తున్నారు. వీరి ప్రతిభను గుర్తించి జిల్లాలోని తాండూరు భద్రేశ్వరస్వామి, కొడంగల్ శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు, చేవెళ్లలోని శంకరమ్మ మాత, వికారాబాద్‌లోని బుగ్గరామేశ్వరం, కుల్కచర్ల మండలం ఏకశిల పర్వత ఉత్సవాల సందర్భంగా మండలి భక్తులను ఆహ్వానిస్తారు. గత వారం శ్రీశైల దేవస్థానం నుంచి ఆహ్వానం అందుకున్నారు. అక్కడ తమ భజన సంకీర్తనల ప్రతిభను చాటుకున్నారు. గతేడాది స్వర్గీయ కొండా మాధవరెడ్డి స్మారకార్థం భజన పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకున్నారు. గ్రామంలో వీరితో పాటు సీతారామచంద్ర మహిళ భజన మండలి కూడా ఉంది.



శ్రీశైలంలో పాల్గొన్న భక్తులు



చంద్రశేఖరాచార్యులను సన్మానిస్తున్న రేగోడ్ మఠం బాధ్యులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి

రేగోడ్: హిందూ సనాతన ధర్మాన్ని, ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని కడప జిల్లా కందిమల్లయ్యపల్లిలోని వీరబ్రహ్మం సంస్కృత వేద పాఠశాల ప్రధానాచార్యుడు చంద్రశేఖరాచార్యులు అన్నారు. మెదక్ జిల్లా రేగోడ్‌లోని బ్రహ్మంగారి మఠాన్ని బుధవారం సందర్శించి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో ఘటనలు, దాడులను తీవ్రంగా పరిగణించి నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బ్రహ్మంగారి మఠం కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ప్రేమించిన అమ్మాయి దక్కదని యువకుడు..



అనిల్ కుమార్

ములుగు, న్యూస్‌టుడే: వారిద్దరు ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. విషయం అమ్మాయి మేనమామలకు తెలియడంతో వారు పెళ్లికి నిరాకరించారు. కోరుకున్న అమ్మాయి దక్కదని భావించిన ఆ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ ఎస్‌ఐ దామోదర్ తెలిపిన వివరాలు.. మర్కూక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(19) హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆ యువతి అతడి కంటే ఏడాది పెద్దది. ఆమె అమ్మమ్మగారిల్లు కూడా పాతూరే. గతేడాది ఆమె ఇక్కడికి వచ్చినప్పుడు అనిల్ కుమార్‌తో పరిచయం ఏర్పడి అది కాస్త ప్రేమగా మారింది. పెద్దలతో మాట్లాడి పెళ్లి చేసుకుందామని ప్రేమికులిద్దరూ నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని యువకుడి తండ్రి కిష్టయ్య అమ్మాయి మేనమామల దృష్టికి తీసుకెళ్లగా వారు నిరాకరించారు. విషయం ఇంతటితో వదిలి పెట్టాలని, అమ్మాయి జోలికి మళ్లీ రాకూడదని మందలించారు. ప్రేమించిన అమ్మాయి దక్కదని తెలుసుకున్న అనిల్ కుమార్ ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తన కొడుకు మృతికి అమ్మాయి మేనమామలు కారణమంటూ అనిల్ కుమార్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మద్యానికి బానిసై డ్రైవర్..



పరశు రాములు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి పరశురాములు(40) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. పరశురాములు వృత్తిరీత్యా డ్రైవర్. ఏడాదిగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. 20 రోజుల క్రితం మద్యం తాగి ఇంటికొచ్చి భార్య వాణితో వాగ్వాదానికి దిగడంతో ఆమె తన పుట్టింటికి(జప్తినాచారం) వెళ్లారు. మనస్తాపానికి గురై బుధవారం తన వ్యవసాయ బావి వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కుటుంబ సమస్యలతో కార్మికుడు..



నాగరాజు

దుబ్బాక, న్యూస్‌టుడే: ఒంటికి నిప్పంటించుకుని దుబ్బాక పట్టణానికి చెందిన బెల్లె నాగరాజు(45) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నాగరాజు వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కుటుంబ సభ్యులతో గొడవలు పడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలకు తాళలేక కేకలు వేయడంతో వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. 108 వాహనంలో సిద్దిపేటకు, అక్కడ్నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఘటనపై దుబ్బాక ఎస్సై గంగరాజును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన కూచన్ మహేశ్వరి (50) ప్రధాన రహదారి బుధవారం డివైడర్ దాటుతుండగా వేములవాడ కమాన్ వైపు ఓ యుకువడు ద్విచక్రవాహనంపై వస్తూ ఆమెను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు ప్రభుత్వం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహేశ్వరి మృతిచెందింది. కుమారుడు భానుప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

నిరీక్షణకు తెర

గిరిజన గురుకుల డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్:

గిరిజనులను పేదరికం నుంచి గట్టెక్కించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో నాలుగేళ్ల కిందట గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సొంత భవనం లేకపోవడంతో రెండేళ్ల క్రితం పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల శివారులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. రెండు సంవత్సరాలుగా ప్రవేశాల ప్రక్రియను నిలిపివేసింది. తాజాగా ప్రభుత్వం ప్రవేశాలకు అనుమతించిన నేపథ్యంలో కథనం. రెండు సంవత్సరాలుగా ప్రవేశాలు లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం ఉంటాయో లేవో తెలియని పరిస్థితి. చాలామంది విద్యార్థులు ఇతర కళాశాలలో ఇప్పటికే చేరారు. ప్రవేశాలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గిరిజన విద్యార్థులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఈనెల 27 లోగా ప్రవేశాలు పొందాలని సూచించడమే దీనికి కారణం. దరఖాస్తులకు మూడు రోజుల సమయం మాత్రమే ఇచ్చారు. గడువు తేదీని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కాలేజీలోని నాలుగు కోర్సుల్లో మొత్తం 240 సీట్లు ఉన్నాయి.



సద్వినియోగం చేసుకోవాలి

– మహేశ్వరి, ప్రిన్సిపల్

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. గిరిజన గురుకులంలో డిగ్రీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. వివరాలకు 96422 86686, 97059 92496, 80080 70959 ఫోన్లలో సంప్రదించాలి.

కోర్సులు: • బీఎస్సీ (ఫిజికల్ సైన్స్) • బీఎస్సీ (లైఫ్ సైన్సెస్) • బీకాం (సీఏ) • బీకాం (ఆనర్)

ప్రత్యేకతలు:

- గిరిజనులకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏకైక గురుకుల డిగ్రీ కళాశాల ఇది
- ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్ ఉన్నాయి.
- క్రీడల్లో ప్రోత్సాహం
- వైఫై సదుపాయంతో కంప్యూటర్ ల్యాబ్
- డిజిటల్ గ్రంథాలయం
- ఉచిత వసతి, నాణ్యమైన భోజనం

పిడుగుపాటుతో ఒకరి మృతి



జాటి పటేల్

గుమ్మడిదల, న్యూస్‌టుడే: పిడుగుపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారానికి చెందిన కుమ్మరి అశోక్ వద్ద ఒడిశా రాష్ట్రం నవాపాడ జిల్లా గోడల్ గ్రామానికి చెందిన జాటి పటేల్(36) మూడు నెలలుగా వ్యవసాయ పనులు చేస్తున్నాడు. 24వ తేదీన ఆయన గేదెలు మేపడానికి పొలానికి వెళ్లారు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. రాత్రయినా జాటి పటేల్ ఇంటికి రాకపోవడంతో యజమాని అశోక్ చరవాణిని సంప్రదించగా ఎత్తలేదు. గేదెలు మాత్రం ఇంటికి వచ్చాయి. పొలం వద్దకు వెళ్లి వెతికినా ఆచూకి లభించలేదు. బుధవారం ఉదయం మళ్లీ వెళ్లి చూడగా డంప్‌యార్డు వద్ద విగత జీవిగా పడి ఉన్నాడు. పిడుగుపాటుతో మృతిచెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నారింజ వాగులో వ్యక్తి గల్లంతు!

వాహనంతో ప్రవాహం దాటుతుండగా ప్రమాదం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంతో వాగు దాటుతూ వరద ఉద్ధృతికి వ్యక్తి గల్లంతవగా మరొకరు నీటిలో కొట్టుకుపోతూ చెట్ల కొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి బూచినెల్లి వద్ద నారింజ వాగు పొంగింది. కర్ణాటకలోని బీదర్ పట్టణ శివారులోని మైలూరుకు చెందిన షాకీర్(40) ద్విచక్ర వాహనంపై ఆయన ఇంటి పక్కన ఉండే ఇస్మాయిల్(60)తో కలిసి జహీరాబాద్ వైపు వస్తున్నారు.



వాగులో కొట్టుకుపోతున్న ఇస్మాయిల్, (వృత్తంలో) షాకీర్

ఇస్మాయిల్‌ను రక్షించిన గ్రామస్థులు

బూచినెల్లి సమీపంలోకి రాగానే నారింజ వాగు వంతెన మీదుగా పారుతున్న వరద ఉద్ధృతిని అంచనా వేయకుండా వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. మధ్యలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో షాకీర్ నీటిలో కొట్టుకుపోగా... ఇస్మాయిల్ పక్కనే చెట్లకొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. వాగులో చెట్లకొమ్మలు పట్టుకుని నీళ్లలో ఉన్న ఇస్మాయిల్‌ను గ్రామస్థులు గుర్తించి రక్షించారు. వ్యక్తి గల్లంతు విషయం తెలుసుకున్న జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఆర్‌ఐ రుక్మొద్దీన్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఘనపూర్-జహీరాబాద్ మార్గంలో రాకపోకలు నిషేధించారు.

నకిలీ అల్లం, వెల్లుల్లి తయారీ ముఠా పట్టివేత



పట్టుబడిన నిందితులతో పోలీసులు

కుల్కచర్ల: కల్తీ అల్లం, వెల్లుల్లి తయారీ ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని 9 క్వింటాళ్ల 38 కిలోల అల్లం, వెల్లుల్లి పేస్ట్, 2 క్వింటాళ్ల వెల్లుల్లిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో శశిధర్ కిరాణ దుకాణాన్ని తనిఖీ చేశారు. అక్కడ నకిలీ అల్లం, వెల్లుల్లి డబ్బాలు లభించాయి. శశిధర్‌ను విచారించగా.. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలకృష్ణ, వెంకటేశ్వర్లు నుంచి కొన్నట్లు తెలిపారు. వారికి కీసర మండల కేంద్రానికి చెందిన దామోదర్‌రెడ్డి సరఫరా చేసినట్లు తేలింది. దామోదర్‌రెడ్డి హైదరాబాదులో ముకుంద జింజర్, గార్లిక్ పేస్ట్ ఇండస్ట్రీని నడుపుతున్నాడు. అందులోనే సిట్రిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, టెస్టింగ్ సాల్ట్‌లతోపాటు కుళ్లిపోయిన వెల్లుల్లి లభించాయి. నిందితులపై కేసు నమోదైంది.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125-00	డ్రెస్డ్	213-00
రిటైల్	147-00	స్కిన్‌లెస్	243-00

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: నర్సారెడ్డి



ఎల్‌వోసీ పత్రాలు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు

జగదేవపూర్: పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన తుర్కపల్లి పోచమ్మ, అశోక్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య సహాయం కోసం వారికి మంజూరైన రూ.5.5 లక్షల ఎల్‌వోసీలను బుధవారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. గజ్వేల్ ఏఎంసీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలిచి పది నెలలు కావొస్తున్నా నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఆకుల శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం దుబ్బాక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే దుబ్బాక పురపాలికలో అవినీతి జరుగుతుందన్నారు. పురాధ్యక్షురాలు, పాలకవర్గం సభ్యులు గత నాలుగేళ్లుగా బతుకమ్మ సంబరాలు, హరితహారం పేరిట లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, వారిపై ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆకుల దేవేందర్, చంద్రారెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


టీజీఈజేఏసీ రాష్ట్ర కార్యదర్శికి సత్కారం



కనకచంద్రంతో సంఘ ప్రతినిధులు, అధ్యాపకులు

సిద్దిపేట: తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ (టీజీఈజేఏసీ) రాష్ట్ర కార్యదర్శిగా సిద్దిపేటకు చెందిన కనకచంద్రం ఎన్నికైన నేపథ్యంలో జిల్లా గెజిటెడ్ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం, ఇతరత్రా సందర్భాల్లో రాష్ట్రంలోని అధ్యాపకులను ఏకతాటిపైకి తెచ్చిన కనకచంద్రం కార్యదర్శిగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు.


వంట వార్పుతో రైతుల నిరసన



టీజీఐఐసీ పరిశ్రమల ముందు భోజనాలు చేస్తున్న రైతులు

వర్గల్, న్యూస్‌టుడే: ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో భూములు కోల్పోయిన రైతులు బుధవారం మూడో రోజు వంట వార్పుతో నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వేలు నిర్వహించి అర్హులైన వారికి పరిహారం అందించాలన్నారు. హెచ్ఎండీఏ అనుమతులతో లేఅవుట్ ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ఇళ్ల స్థలాలను అందించాలని డిమాండ్ చేశారు. స్పందించకుంటే కంపెనీల నిర్మాణాలను అడ్డుకుంటామన్నారు.

పశువైద్యం.. అందని దైన్యం



పశువులు అనారోగ్యానికి గురైతే సూదిమందు ఇచ్చే పశువైద్యులు లేక మండల పరిధిలో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్తినా పశు వైద్యులు అందుబాటులో లేక వెనుదిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల వైద్యులున్నా మందులు లేవని చెప్పి బయటికి పంపుతున్నారు. రెండు నెలల కిందట దౌల్తాబాద్ ఆసుపత్రికి పశువైద్యాధికారిణి వచ్చారని, పశువులను తీసుకొని ఎప్పుడు వెళ్లినా ఆమె అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై పశువైద్యాధికారిణి నిఖిలను చరవాణి ద్వారా సంప్రదించగా ఆమె నుంచి స్పందన లేదు. - న్యూస్‌టుడే, దౌల్తాబాద్

స్వయం ఉపాధికి బాటలు

స్వావలంబన దిశగా స్వశక్తి మహిళలు

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం:

వారంతా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన మహిళలు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల సహకారంతో వివిధ యూనిట్లు ఏర్పాటు చేసి రాణిస్తున్న తీరుపై ప్రత్యేక కథనం.



పందిళ్లలో ఏర్పాటు చేసిన కోడిపిల్లల మదర్ యూనిట్

కోడిపిల్లల పెంపకంతో రూ.40 వేల ఆదాయం



హుస్నాబాద్ మండలం పందిల్లకు చెందిన మందాటి రమాదేవి కోడిపిల్లల మదర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు మండల సమాఖ్య నుంచి రూ.2లక్షల రుణం తీసుకున్నారు. తమ కున్న షెడ్డులో సోనాలి రకానికి చెందిన 3 వేల కోడిపిల్లలు కొనుగోలు చేశారు. వాటిని 6 వారాల పాటు పెంచారు. తర్వాత గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కొనుగోలు చేసి హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని స్వశక్తి సంఘాల మహిళలకు పంపిణీ చేశారు. ఖర్చులు పోను రూ.40వేలకు పైగా లాభం పొందారు.

డెయిరీ పార్లర్ నడుపుతూ..



అక్కన్నపేట మండలం అంతకపేటకు చెందిన బోయిని రమాదేవి మండల సమాఖ్య నుంచి రూ.2 లక్షల అప్పుగా తీసుకున్నారు. ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా హుస్నాబాద్‌లో డెయిరీ పార్లర్ ఏర్పాటు చేశారు. మొదట్లో కొంచెం ఇబ్బందులు ఎదురైనా తీసుకున్న అప్పును క్రమం తప్పకుండా చెల్లిస్తూ.. స్వయం ఉపాధి పొందుతున్నారు.


పట్టుపురుగుల పెంపకం చేపట్టి..



హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌కు చెందిన ఇనుగొండ వాణి పట్టుపురుగుల పెంపకం చేపట్టారు. 'రేణుకా మండల సమాఖ్య' నుంచి రూ.2 లక్షల రుణం తీసుకొని, తమకున్న షెడ్డులో పట్టుపురుగులు పెంచుతున్నారు. 400 గుడ్లను తెచ్చి 21 రోజుల పాటు పెంచిన తర్వాత పట్టుగూళ్లను విక్రయిస్తున్నారు. ఒక్కో పంట కాలం నెలరోజులు మాత్రమేనని, అందులో ఆరు రోజులు పని బాగా ఉంటుందని వాణి తెలిపారు. ఒక్కో పంటకు పెట్టుబడి ఖర్చులు పోను రూ.50వేల వరకు లాభం మిగులుతుందని తెలిపారు.

జిల్లాలో స్వశక్తి మహిళల వివరాలు	
గ్రామైక్య సంఘాలు:	726
మండల సమాఖ్యలు:	23
స్వయం సహాయక బృందాలు:	18,271
మొత్తం సభ్యులు:	1,94,053
ఈ ఏడాది బ్యాంకు లింకేజీ రుణ వితరణ లక్ష్యం:	రూ.897 కోట్లు
సాధించిన ప్రగతి:	రూ.397కోట్లు

సమాజంలో పోలీసుల పాత్ర కీలకం



డ్యూటీమీట్ నిర్వహిస్తున్న ఏఆర్ అడిషనల్ డీసీపీ రాంచంద్రరావు, తదితరులు

చిన్నకోడూరు: సమాజంలో పోలీసు ఉద్యోగుల విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఆర్ అడిషనల్ డీసీపీ రాంచంద్రరావు సూచించారు. బుధవారం చిన్నకోడూరు మండలం మెట్టకొడూరు శివారులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు డ్యూటీమీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాల అమలు, అంతర్గత భద్రత, నేరాలను శాస్త్రీయంగా గుర్తించడం, దర్యాప్తు సామర్థ్యాలను మెరుగుపరచుకోవడం గురించి ఆయన వివరించారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది జోన్, రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఆర్ఎస్ఐలు, బీడీ టీమ్, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్ తదితరులు

దుబ్బాక, న్యూస్‌టుడే: దేశానికి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అందించిన సేవలు మరువలేనివని, అంత్యోదయ అనే భావనను దేశానికి పరిచయం చేసి, కేంద్ర పథకాలకు మార్గదర్శకుడు ఆయనేనని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం దీన్‌దయాళ్ జయంతిని పురస్కరించుకొని దుబ్బాకలోని భాజపా క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుభాష్‌రెడ్డి, సుంకోజి ప్రవీణ్, గాజుల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్: గజ్వేల్‌లో దీన్‌దయాళ్ చిత్రపటానికి భాజపా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి ఏగొండ, గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు సందీప్, నాయకులు నరసింహ, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



వర్మికంపోస్టు పిట్‌ను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ బాలశౌరి


అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువులతో వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించవచ్చని లోటీ సామాజిక సేవా సంస్థ కో-ఆర్డినేటర్ బాలశౌరి అన్నారు. అక్కన్నపేట మండలంలోని కేశనాయక్‌తండా, లక్ష్మాపూర్, యక్కండా, మల్లుపుకుంటతండా తదితర తండాల్లో మానోస్ యూనిడస్ సహకారంతో సంస్థ రైతుల కోసం ఉచితంగా నిర్మించిన వర్మికంపోస్టు పిట్లను పరిశీలించారు. రైతులు వర్మికంపోస్టు పిట్‌లతో సేంద్రియ ఎరువు తయారు చేసుకోవాలన్నారు. ఫీల్డ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

హరీశ్‌రావు, కేటీఆర్‌లను విమర్శించే స్థాయి మైనంపల్లికి లేదు: భారాస

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు హరీశ్‌రావును విమర్శించే స్థాయి మైనంపల్లికి లేదని భారాస నాయకులు సోమిరెడ్డి, ఎల్లారెడ్డి, పాల సాయిరాం అన్నారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్‌లపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. మైనంపల్లికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయటం సరైంది కాదన్నారు. లింగంగౌడ్, అంజనేయులు, నరేశ్‌గౌడ్, తిరుపతి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్: కల్యాణలక్ష్మి చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం(టీడీఎఫ్) జిల్లా మాజీ అధ్యక్షులు, భారాస సీనియర్ నేత కల్యాణ్‌కర్ నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారాస నాయకులతో కలిసి ఆయన బుధవారం గజ్వేల్‌లో మాట్లాడారు. అధికారంలోకి వస్తే తులం బంగారం ఆడపిల్లల ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు హామీలను నెరవేర్చలేకపోయారన్నారు. నాయకులు ఆత్మే శ్రీనివాస్, చింత శ్రీనివాస్, అజిత్, కరీం, తదితరులున్నారు.

కృత్యాధార బోధనతో మెరుగైన అభ్యసనం



గుండె గురించి వివరిస్తున్న ఆర్‌పీ వెంకటరమణారెడ్డి

హుస్నాబాద్ గ్రామీణం: కృత్యాధార బోధనతో అభ్యసనం మెరుగుపడుతుందని అక్కన్నపేట ఎంఆర్పీ గుగులోతు రంగా అన్నారు. బుధవారం మండలంలోని మల్లంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతిక, రసాయన, జీవశాస్త్ర ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవశాస్త్రంలోని గుండె, మూత్రపిండాల కోతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేక గుండె, మూత్రపిండాలను తీసుకొచ్చి. రిసోర్స్ పర్సన్ వెంకటరమణారెడ్డి వాటిని కోసి గుండె, మూత్రపిండాల్లోని గదులు, కవాటాలు, భాగాలు, వాటి నిర్మాణం, పనితీరును వివరించారు. అనంతరం భౌతిక, రసాయన శాస్త్రానికి సంబంధించిన కృత్యాధార కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్పీలు శ్రీనివాస్, ఆర్.సుధాకర్, శ్రీనివాస్ వ్యవహరించారు.

శిక్షణార్థులకు అవగాహన



బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధులు రేష్మ, లక్ష్మణ్ అవగాహన కల్పించారు. మహిళలు, బాలల రక్షణకు తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. పిల్లలకు అవసరమైన సాయం అందించేందుకు చైల్డ్ హెల్ప్ లైన్ నం. 1098 సంప్రదించాలని కోరారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలని వినతి

రాయపోల్: జీవో 81, 85 ప్రకారం 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏ వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని వీఆర్ఏ కారుణ్య నియామకాల సంఘం మండలాధ్యక్షుడు పంగ స్వామి అన్నారు. బుధవారం రాయపోల్ తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. మండల ఉపాధ్యక్షుడు సుందర్, ప్రధాన కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

కోహెడ: వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోహెడ స్థానిక తహసీల్దారు సురేఖకు వినతి పత్రం అందజేశారు. వెంకటేశం, మౌనిక, సతీష్, వెంకయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తబుట్టల పంపిణీ

హుస్నాబాద్: పట్టణంలోని 15వ వార్డులో పలు కుటుంబాలకు తడి, పొడి చెత్త బుట్టలను పురపాలిక అధికారులు పంపిణీ చేశారు. బుధవారం వార్డులో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పుర ఉద్యోగులు రజిత మాట్లాడారు. ఇళ్లలోని చెత్తను వేరుచేసి పుర వాహనానికి అందించాలని కోరారు. ఉపాధ్యక్షురాలు అనిత, కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు

నంగునూరు: చదువుతోపాటు విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంఈవో దేశిరెడ్డి అన్నారు. రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి అండర్- 14, 17 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు బుధవారం నంగునూరులో ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రామస్వామి గౌడ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రాజమౌళి పాల్గొన్నారు.

సబ్ కమిటీని రద్దుచేసి న్యాయం చేయాలి

మిరుదొడ్డి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాల సామాజిక వర్గానికి వ్యతిరేకంగా వేసిన సబ్ కమిటీని రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ర్యాకం శ్రీరాములు అన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ఈ కమిటీని రద్దు చేయకుంటే మాలల సత్తా చాటుతామన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు భీమసేన, అసబాబు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

హుస్నాబాద్ గ్రామీణం: హుస్నాబాద్ మండలం తోటపల్లి-పూసచెర్వుపల్లి మధ్య కోనేటివాగుపై వంతెన నిర్మాణానికి రూ.2.50కోట్లు మంజూరు కావడంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం వాగు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

గ్రామస్థుల అభినందన

కొండపాక గ్రామీణం: సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడకు చెందిన అనంతుల గణేశ్ అండర్ -19 విభాగంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఎంపికయ్యారు. దీంతో గణేశ్‌ను బుధవారం గ్రామస్థులు, బంధుమిత్రులు అభినందించారు. భవిష్యత్తులో దేశస్థాయిలో ఆడాలని ఆకాంక్షించారు.

యువకుడి అదృశ్యం


చేర్యాల: కొమురవెల్లి రాజా పరిధిలోని చేర్యాల మండలం నాగపురికి చెందిన యువకుడు తలారి మహేశ్(29) అదృశ్యమైనట్లు అతని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొమురవెల్లి ఎస్సై రాజు తెలిపారు. ఈనెల 21న తాను సదివిన ఆటో ట్రీట్మెంట్ ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయని.. అప్పటి నుంచి తనలో తానే బాధపడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా బుధవారం ఉదయం నుంచి కనిపించడం లేదని, అతను పనిచేస్తున్న చేర్యాలలోని దుకాణంలో, మిత్రులు, గ్రామస్థులు, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లేదని ఆమె వివరించారు.

దారి.. ప్రమాదకరంగా మారి!



కోహెడ మండలంలోని ఇదే వల కరీమన భారీ వర్షాలకు తారు, సీసీ రోడ్లమీదికి మట్టి చేరింది. ప్రమాదాలు మూలమలుపుల వద్ద ఇసుక లేస్తూ గాలికి కళ్లల్లో పడుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టిపై వెళ్తున్న వాహనాలు జారి పడిపోతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రోడ్ల మీదకు చేరిన మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట



కొడకండ్లలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

గజ్వేల్ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం కొడకండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళ, పోలీస్ చట్టాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. ఏఎస్ఐ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపాక గ్రామీణం: కొడకండ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలపై కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ గజ్వేల్ షీటీమ్ సభ్యులు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, ఏఎస్ఐ శ్రీరాములు ఉన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి సర్కారు కృషి



ఎంఈవో అంజయ్యను శాలువాతో సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఛైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలకు ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ బాబు, అంజయ్యలకు ఆయన శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మాట్లాడారు.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా పర్యవేక్షించాలన్నారు. పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(ధూల్మిట్ట, మద్దూరు), గజ్వేల్ గ్రామీణం: ధూల్మిట్ట మండల విద్యాశాఖ అధికారిగా మీనాంజనేయులు, మద్దూరు ఎంఈవోగా వరదరాజు, గజ్వేల్ ఎంఈవోగా వై.కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

హుస్నాబాద్ గ్రామీణం: హుస్నాబాద్, అక్కన్నపేట ఎంఈవోలుగా బండారి మనీల, గుగులోతు రంగా బాధ్యతలు చేపట్టారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పీర్లపల్లిలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీవో సరిత

జగదేవపూర్, న్యూస్‌టుడే: సరైన పోషకాహారం తీసుకుంటే ఆరోగ్య సమస్యలు అధిగమించవచ్చని సీడీపీవో సరిత అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పీర్లపల్లిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆకుకూరలు, చిరుధాన్యాల వంటకాలు ఎక్కువగా తినాలన్నారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు భవాని, ప్రత్యేకాధికారి, ఏవో వసంతరావు, వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌ఛార్జిగా వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌ఛార్జిగా కవ్వ వేణుగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. సిద్దిపేటలో బుధవారం కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగిందని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటుతోపాటు డివిజన్ ఇన్‌ఛార్జి నియామకం చేశారన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ కాల్వలో పడి వ్యక్తి మృతి

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: మల్లన్నసాగర్ కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందారు. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవపూర్ మండలం అలీరాజ్‌పేటకు చెందిన కందుకూరి కిష్టయ్య(58) పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లారు. గజ్వేల్ మండలం దాతారుపల్లి, రిమ్మనగూడ మధ్యలో ఉన్న మల్లన్నసాగర్, కొండపోచమ్మ కాలువలో చేపలు పట్టేందుకు దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారన్నారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని ద్విచక్ర వాహనంపై ఉన్న ఈ-చలాన్ ఆధారంగా వివరాలు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: కోహెడ మండలంలోని శనిగరం గ్రామ పంచాయతీ పరిధి శంకర్‌నగర్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. బుధవారం నమ్మదగిన సమాచారంతో వెళ్లి వాహన తనిఖీలు చేపట్టగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా హైదరాబాదుకు ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

విద్యుత్తు ప్రమాద ఘటనపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): అక్కన్నపేట మండలం గుడాటిపల్లి పరిధిలోని జాలుబాయితండా వద్ద విద్యుదాఘాతంతో యువకుడు గుగులోతు తిరుపతి(29) మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. ధూల్మిట్ట మండలం కొండాపూర్ పరిధిలోని జీవులారతండాకు చెందిన తిరుపతి ప్రైవేటు విద్యుత్తు వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గుడాటిపల్లి పరిధిలో ఏదైనా విద్యుత్తు సమస్యలు వస్తే గౌరవెల్లి ఏఎల్ఎం అతన్ని పిలిపించి అప్పుడప్పుడు పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 24న జాలుబాయితండా వద్ద విద్యుత్తు నియంత్రిక వద్ద మరమ్మతు చేస్తుండగా తిరుపతి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఏఎల్ఎం నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని మృతుడి తల్లి కౌసల్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీఈ లక్ష్మీనారాయణ, ఏడీఈ దుర్గాశ్రీనివాస్, ఏఈ మహ్మద్ బాషా ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్య కార్మికులపై దాడి

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలం కట్కూర్‌లో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులపై దాడి జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. ఎస్సీ కాలనీలోని ఓ ఇంటి ఎదుట ఉన్న కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టారు. దాన్ని ప్రవీణ్ ఇంటి వద్ద ప్రధాన పైపులైన్ వద్ద తవ్వి చూడగా పైపులోకి చెట్టవేర్లు చొచ్చుకెళ్లాయని గుర్తించారు. వాటిని తొలగించేందుకు ఈ నెల 22న కార్మికులు బొజ్జ సదానందం, మద్దెల రజనీకాంత్, ఉట్లెంగుల వెంకటయ్య మరమ్మతు చేస్తుండగా అదే కాలనీకి చెందిన బొజ్జ బాలయ్య అభ్యంతరం చెప్పారు. ఆ ఇంటికి నీరు రావడం లేదని, ఏం పనిచేస్తున్నారంటూ వారిపై దాడి చేశారు. దీనిపై అక్కన్నపేట ఠాణాలో ఫిర్యాదు చేశారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్: మద్యం తాగి పట్టుబడిన వాహనదారులకు బుధవారం జిల్లా సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. 30 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి మొత్తంగా రూ.35,000 జరిమానా విధించారు.

తప్పిపోయిన పసిపాప అప్పగింత

సిద్దిపేట టౌన్: తప్పిపోయిన మూడేళ్ల పసిపాపను తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన సిద్దిపేటలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బల్దియా అధికారులు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే పాఠశాల మైదానంలో ఓ పసిపాప ఒంటరిగా రోదిస్తూ కనిపించింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న జవాన్లు బాను భాయ్, మల్లేశం పాపను దగ్గరికి తీసుకుని బిస్కెట్లు ఇచ్చారు. ఇంతలోనే మరోపాప వచ్చి ఆ చిన్నారి గురించి తెలుపగా పాప తండ్రికి ఫోన్ చేసి అతన్ని పిలిపించి పాపను అప్పగించారు. ఈ మేరకు బల్దియా అధ్యక్షురాలు మంజుల వారిని అభినందించారు.